పాఠం 8

# ప్రజలు, వలసలు

## రామయ్య – హైదరాబాదుకి వలస వచ్చిన ఒక టీచరు

మా తల్లిదండ్రులు, తాత, నానమ్మ చాలా సంవత్సరాలు నల్గొండ జిల్లా చిట్యాల మండలంలో మొగిలిదోరి గ్రామంలో ఉండేవాళ్లు. వాళ్లు సాగునీటికి బోరు బావులపై ఆధారపడి ప్రధానంగా వరి, ప్రత్తి పంటలు పండించేవాళ్లు.

హైదరాబాదు నుంచి మొగిలిదోరి 80 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ ఊళ్లో 700–800 జనాభాతో 150 ఇళ్లు ఉన్నాయి. ఇక్కడి అనేక కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నాయి. నా చిన్నతనంలో మొగిలిదోరి నుంచి హైదరాబాదు వెళ్లటానికి రోడ్లు, బస్సు సౌకర్యం ఉండేది కాదు. 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న నల్గొండకి వెళ్లటానికి కూడా సరైన సదుపాయాలు ఉండేవి కావు.

1970లలో మా ఊరికి 1–3 తరగతులతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వచ్చింది (ఇప్పుడు దీంట్లో అయిదవ తరగతి వరకు ఉంది). నేను 1 నుంచి 3వ తరగతి వరకు మొగిలిదోరిలో చదువుకున్నాను. తరువాత దగ్గర గ్రామమైన చిన్నకాపర్తిలో 4నుంచి 7వ తరగతి వరకు చదివాను.

8నుంచి 10వ తరగతి వరకు మొగిలిదోరికి 9 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్దకాపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లాను. ఆ సమయంలో నేను ప్రభుత్వ వసతిగృహంలో ఉండి చదువుకున్నాను. ఆ తరువాత ఇంటర్మీడియట్, టీచరు ట్రైనింగ్ సర్టిఫికెట్ కోర్సులను హైదరాబాదులోని ప్రభుత్వ విద్యా సంస్థలలో పూర్తి చేశాను. ఈ కోర్సుకి దరఖాస్తు చేయడంలో ఒక మిత్రుడు సహాయం చేశాడు, అంతేకాదు హైదరాబాదులో ఎక్కడ ఉండాలో సలహా ఇచ్చాడు.

నాకు 1983లో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిగా ఉద్యోగం వచ్చింది. మొగిలిదోరికి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న పంతంగి (ఇది కూడా నల్గొండ జిల్లాలోనే ఉంది) నా తొలి నియామకం. రెండు సంవత్సరాల తరువాత నన్ను మరో ఊరి పాఠశాలకు బదిలీ చేశారు. అక్కడ నేను 5½ సంవత్సరాలు పనిచేశాను. ఈ కాలంలో నా భార్య, పిల్లలతో నేను పంతంగి లేదా చౌటుప్పల్‌లో ఉండేవాడిని. నేను రోజూ నా పని చేసే ప్రదేశానికి వెళ్లి, వస్తుండేవాడిని. 2004 సంవత్సరంలో మా కాపురం హైదరాబాదుకి మార్చాం. గత 10 సంవత్సరాలుగా మేం వ్యవసాయం చెయ్యటం లేదు. అంతకు ముందు మేం ఉపయోగించిన బావి ఇప్పుడు ఎండిపోయింది. మొగిలిదోరిలో ఉంటున్న మరొక వ్యక్తికి భూమిని కౌలుకి ఇచ్చాం. అతడు మాకు కొంత డబ్బులు ఇచ్చి, పత్తి సాగు చేస్తాడు. నా బాల్యంలో భూమి ఉన్న చాలా కుటుంబాలు ప్రస్తుతం పట్టణాలకు వలస వచ్చాయి. అప్పుడు వ్యవసాయ కూలీలుగా ఉన్న కుటుంబాలు ఇప్పుడు భూమిని కౌలుకి తీసుకుని సాగు చేస్తున్నాయి.


చిత్రం 8.1:

● హైదరాబాదు నగరంతో పాటు నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలను చూపించే పటం గీయండి. ఈ ఉదాహరణలలోపేర్కొన్న గ్రామాలను కలుపుతూ బాణం గుర్తులు గీయండి.

ఈ టీచరే కాదు వందలాది, వేలాది ప్రజలు విద్య, ఉపాధి, మెరుగైన అవకాశాల కోసం పట్టణ ప్రాంతాలకు వలస వెళు తున్నారు. వలస వెళ్లటానికి కొంత మద్దతు అవసరమవుతుంది. కాలక్రమంలో ప్రజలు కొత్త ప్రదేశాలకు వెళతారు, కొత్త వాళ్లతో సంబంధాలు ఏర్పరచుకుంటారు, భిన్న సంస్కృతులను అర్థం చేసుకుని అందులో జీవిస్తారు.

## వలస తీరులను వర్గీకరించడం, కొలవడం

వివిధ ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాల వల్ల వలసలు వెళుతుంటారు. ఒక వ్యక్తిని వలస వెళ్లిన వాళ్లుగా గుర్తించడానికి జనాభా గణన వాళ్లు రెండు ప్రామాణికాలను ఉపయోగిస్తున్నారు:

- "జన్మస్థానం" – ఒక వ్యక్తి పుట్టిన ప్రదేశం
- "ఇంతకుముందు నివాసం ఉన్న స్థలం" – ఒక వ్యక్తి ఆరు నెలలు లేదా అంతకు మించి ఎక్కువకాలం పాటు ఉన్న ప్రదేశం

● ఇక్కడ కొంతమంది జాబితా ఉంది. వాళ్లని వలస వెళ్లిన వాళ్లు, వెళ్లని వాళ్లుగా వర్గీకరించండి. వలస తీరుని పేర్కొని, వలసకు కారణం ఏమై ఉంటుందో చెప్పండి.

| పేరు | గత ఆరు నెలలుగా ఉంటున్న ప్రదేశం | పుట్టిన ఊరు | వలస వచ్చారా, లేదా | వలస తీరు: గ్రామీణ నుంచి పట్టణానికి, పట్టణం నుంచి గ్రామానికి, వగైరా, కారణం |
|---|---|---|---|---|
| సింధు | రాజమండ్రి | తూర్పుగోదావరి జిల్లాలో ఒక గ్రామం | | |
| గ్రేస్ ఓవియా | హైదరాబాదు | విజయవాడ | | |
| అలీ | కొత్త ఢిల్లీ | లండన్ | | |
| రామయ్య | హైదరాబాదు | మొగిలిదోరి | | |
| లక్ష్మి | తిమ్మాపురం (2 నెలలనుంచే) | నెల్లూరు జిల్లాలో కోదండరామపురం | | |
| స్వాతి | కరీంనగర్ జిల్లాలో గట్ల నర్సింగాపూర్ | విజయవాడ | | ఎపిపిఎస్‌సి పరీక్షలో ఉత్తీర్ణత |

భారతదేశంలో 2001 జనాభా లెక్కల ప్రకారం 30.7 కోట్లమంది వలస వెళ్లారు. అనేక కారణాల వల్ల వలసలు జరగవచ్చు. ఆడవాళ్లలో వలస వెళ్లటానికి వివాహం ప్రధాన కారణం కాగా మగవాళ్లలో ఉపాధి లేదా ఉపాధికోసం అన్వేషణ ప్రధాన కారణం. ఉన్న ఊరిలోని ఉపాధి అవకాశాలపై అసంతృప్తి, విద్యకు మెరుగైన అవకాశాలు, వ్యాపారంలో నష్టాలు, కుటుంబ తగాదాలు వంటివి జనగణన సర్వేలో ప్రజలు వలసకు కారణాలుగా పేర్కొన్నారు.

వలస వెళ్లే వాళ్లలో అధిక శాతం తక్కువ దూరమే వెళతారు. 30.7 కోట్ల వలస వ్యక్తులలో 25.9 కోట్ల మంది (84.2%) రాష్ట్రంలోని ఒక భాగం నుంచి మరొక భాగానికి, అంటే ఒక పల్లె లేదా పట్టణం నుంచి మరొక పల్లె లేదా పట్టణానికే వెళ్లారు. వలస వెళ్లిన వాళ్లలో 13% ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి వెళ్లారు (కింది పట్టిక చూడండి).


*పట్టిక 1 : భారతదేశంలో వలస (2001 జనాభా లెక్కలు)*

| వర్గీకరణ | ప్రజల సంఖ్య | శాతం | శాతాన్ని లెక్కించే సూత్రం | వివరణలు |
|---|---|---|---|---|
| మొత్తం జనాభా | a.1,028,610,328 | | | |
| మొత్తం వలస | b.307,149,736 | 29.9 | (b÷a) × 100 | మొత్తం వలస శాతం, జన్మస్థలం నుంచి |
| రాష్ట్రంలోనే వలసపోయినవారు | c. 258,641,103 | 84.2 | (c÷b) × 100 | జన్మించిన రాష్ట్రంలోనే వలస వెళ్ళినవారు |
| రాష్ట్రం బయటినుంచి వలస వచ్చిన వారు | d.? | 13.8 | (d÷b) × 100 ? | |
| ఇతర దేశాల నుంచి వలస వచ్చిన వారు | e. 6,166,930 | 2.0 | (e÷b) × 100 ? | |
| | | | | |


- పై పట్టిక మరొకసారి చదివి ఖాళీలను పూరించండి.

ఇక్కడ మూడు పటాలు ఉన్నాయి. భారతదేశంలో ఉత్తర, తూర్పు, పడమర, దక్షిణ ప్రాంతాల మధ్య వలసలను ఈ పటాలు చూపిస్తాయి. గత దశాబ్దంలో (2001-2011) ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్, జార్ఖండ్ ఒడిశా, ఉత్తరాఖండ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, హర్యానా, పంజాబ్, కర్నాటక రాష్ట్రాలకు వలస వెళ్లారు. భారతదేశ రాజకీయ పటంలో ఇటీవల వలసలను గుర్తించండి. ఒక రాష్ట్రం నుండి మరొక రాష్ట్రానికి వలస వెళ్లేవాళ్లలోని సారూప్యాలు, తేడాలను తరగతి గదిలో చర్చించండి.

పటం 1: పట్టణం నుంచి పట్టణానికి అంతర రాష్ట్ర నికర వలస అంచనా, పట్టణ అంతర రాష్ట్ర వలస 2001-2011





పటం 2: గ్రామీణం నుంచి పట్టణానికి అంతర రాష్ట్ర నికర వలస అంచనా, పట్టణ అంతర రాష్ట్ర వలస 2001-2011



- పటం 1లో ఉత్తరప్రదేశ్, బీహార్‌ల నుండి ఢిల్లీ నగరానికి వలసపోయిన వారి సంఖ్యని అంచనావేయండి.
- పటం 2లో కర్ణాటక నుండి ఆంధ్రప్రదేశ్‌కు గ్రామాల నుండి పట్టణాలకు వలసపోయిన వారి సంఖ్యను అంచనావేయండి.
- పటం 3ను పరిశీలించి తమిళనాడు రాష్ట్రంలో అంతర, బాహ్య వలసలకు కారణాలు కనుగొనండి.

*పటం 3: ప్రధాన అంతర రాష్ట్ర వలస మార్గాల అంచనా: 2001-2011*




***గమనిక:*** *ఈ పటంలో కొత్తగా ఏర్పాటైన రాష్ట్రాలు ఇవ్వబడలేదు.*

## గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలస

గ్రామీణ ప్రాంతాలలో తగినన్ని ఉపాధి అవకాశాలు లేనందున, గ్రామీణ ఉపాధిలో తగినంత ఆదాయం లేనందున ప్రజలు ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలస వెళు తున్నారు. కుటుంబ సభ్యులకు మరిన్ని అవకాశాలు, అధిక ఆదాయాలు, మెరుగైన సేవలు ఉంటాయన్న ఆశతో ప్రజలు వలస వెళతారు. రామయ్యకు వ్యవస్థీకృత రంగంలో పని దొరికింది. కానీ, పట్టణాలకు వలస వెళ్లేవాళ్లల్లో చాలామంది కూలీలుగా పని చెయ్యాల్సి వస్తుంది, అదీ అవ్యవస్థీకృత రంగంలో ఉపాధిని వెదుక్కోవలసి ఉంటుంది. వాళ్లు బజారులో తిరుగుతూ సరుకులు అమ్ముతుండవచ్చు, పెయింటర్లు, మరమ్మతులు చేసేవాళ్లు, రిక్షా తోలేవాళ్లు, భవన నిర్మాణ కార్మికులు కావచ్చు.

ఆదాయం పెంచుకోటానికి, కుటుంబ అవకాశాలు మెరుగు పరుచుకోవటానికి గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలు, నగరాలలో పరిశ్రమలు, సేవా రంగాలలో పని చేయటానికి వలస వెళ్లటం కొంతమందికి సహజ స్పందనగా పరిగణిస్తారు. ఈ ప్రక్రియలో వాళ్లకు చదువుకోటానికి, కొత్త ఉద్యోగాలు చెయ్యటానికి, కొత్త నైపుణ్యాలను నేర్చుకోటానికి అవకాశాలు లభిస్తాయి. అంతేకాకుండా లింగ, కుల ఆధారిత వివక్షత పట్టణ ప్రాంతాలలో తక్కువగా ఉండి వాళ్లకు అధిక స్వేచ్ఛను ఇస్తున్నట్లు ఉంటాయి. అయితే చాలామంది గ్రామీణ ప్రాంతాలలో చాలినంత ఉపాధి దొరకక తప్పనిసరి అయి పట్టణాలకు వలస వెళతారు. ఇటువంటి ప్రజలకు పట్టణాలు, నగరాలలోని మురికివాడలలో తగినంత చోటు లేక, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాలు లేక పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. ఇటువంటి వాళ్లకు 'వ్యవస్థీకృత రంగం'లో పని దొరకటం కష్టం. కాబట్టి వీళ్లు ఆశించిన ఉద్యోగ భద్రత ఉండదు, మెరుగైన ఆదాయం ఉండదు. వాళ్లు రోజుకూలీలుగా బతుకులు ఈడుస్తుంటారు.

- పట్టణంలో అసంఘటిత రంగంలో రోజుకూలీగా లేదా ఇంటిపనులు చేసే మహిళగా పట్టణానికి వలస వచ్చిన ఒక వ్యక్తిని ఇంటర్వ్యూ చేసి ఆమె కథ రాయండి (పైన ఇచ్చిన రామయ్య కథనాన్ని చూడండి).
- మీరు గ్రామీణ ప్రాంతంలో ఉంటుంటే పట్టణంలో అసంఘటిత రంగంలో పని చేస్తూ పండగకు ఊరొచ్చిన ఒక వ్యక్తిని ఇంటర్వ్యూ చేసి అతడి కథ రాయండి (పైన ఇచ్చిన రామయ్య కథనాన్ని చూడండి).
- ఈ రెండు పరిస్థితుల మధ్య పోలికలు, తేడాలు పేర్కొనండి.


చాలా మందికి తమ స్వగ్రామంలోనూ, వలస వెళ్లిన ప్రాంతంలోనూ ఇళ్లు ఉంటాయి. వివిధ కాలాల్లో పనిని బట్టి వాళ్లు ఈ రెండు ప్రదేశాల మధ్య తిరుగుతుంటారు. వలస వెళ్లారంటే మొత్తం కుటుంబం వలస వెళ్లాలని లేదు, సాధారణంగా భార్య గ్రామీణ ప్రాంతంలో ఉండిపోతుంది.

వలస వెళ్లిన వాళ్లు ఇంటికి పంపించే డబ్బు గ్రామీణ ప్రాంతంలో ఉండిపోయిన కుటుంబానికి అదనపు ఆదాయంగా ఎంతో ముఖ్యమైనది. గ్రామీణ కుటుంబ సభ్యుల అవసరాన్ని బట్టి ఇంటికి పంపించే డబ్బు ఆధారపడి ఉంటుంది, పట్టణ ప్రాంతంలో కొనసాగాలన్న ఒత్తిడి ఉంటుంది. వలస వచ్చిన వాళ్లు ఊళ్లోని తమ ఇల్లు, భూములపై హక్కులను కాపాడుకోటానికి గ్రామీణ ప్రాంతాలతో తమ ఆర్థిక సంబంధాలను కొనసాగిస్తారు. గ్రామీణ ప్రాంతంలో ఉండిపోయిన కుటుంబ సభ్యులు పట్టణానికి వలస వచ్చిన వాళ్లకు చాలా ముఖ్యం. వాస్తవానికి కుటుంబ సభ్యులు వలస వెళ్లాలో, వద్దో కుటుంబమే నిర్ణయిస్తుంది.

తమ విద్యా, నైపుణ్యతలను బట్టి పట్టణాలకు వలస వచ్చిన వాళ్లు ఉపాధికి రక రకాల పద్ధతులు ఉపయోగిస్తారు. పట్టణాలలో ఉద్యోగాలు దొరకటానికి పరిచయాలు, సంబంధాలు చాలా కీలకమైనవి. ఒక్కొక్కసారి తమ పరిచయాలు, సంబంధాల ద్వారా ముందుగా ఉద్యోగం దొరకబుచ్చుకున్న తరువాతే గ్రామీణ ప్రాంతాల ప్రజలు పట్టణాలకు వస్తారు. అనేక కారణాల వల్ల వాళ్లు తమ గ్రామీణ ప్రాంతాలతో సన్నిహిత సంబంధాలు పెట్టుకుంటారు. వలస వెళ్లిన వాళ్లు పట్టణ అవకాశాలను గ్రామీణ ప్రాంతాలకు బదిలీ చేస్తుంటారు, దీని వల్ల వలస వెళ్లాలనుకుంటున్న వాళ్లు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉద్యోగాల కోసం అన్వేషించవచ్చు. అనేక సందర్భాలలో, అనేక కుటుంబాలకు వలస అనేది వాళ్ల మనుగడను ఎంచుకునే విధానం అవుతుంది.

భారతదేశంలో 1961–2011ల మధ్య అయిదు దశాబ్దాల కాలంలో పట్టణాలు, నగరాలలో పెరిగిన జనాభాని గ్రాఫ్ 1లోని బార్ చార్ట్ చూపిస్తుంది. 1961–71ల మధ్య పట్టణ ప్రాంతాల జనాభా 3 కోట్లు పెరిగింది. ఈ పెరుగుదలలో 60 లక్షలు లేదా అయిదింట ఒక వంతు మాత్రమే గ్రామీణ ప్రాంతాలనుంచి పట్టణాలకు వచ్చే ప్రజల వలస వల్ల పెరిగింది. పట్టణాల్లో ఉంటున్న ప్రజల సహజ పెరుగుదల వల్ల పట్టణ జనాభాలో అధికశాతం వృద్ధి ఉంది. పట్టణ ప్రాంతాల జనాభా పెరగటానికి మూడవ కారణం విస్తరణ ప్రభావం, కొన్ని గ్రామీణ ప్రాంతాలు పెరిగి పట్టణ ప్రాంతాలవుతాయి.

- పట్టణ ప్రాంతాల్లో ఉద్యోగాలు దొరకటానికి పరిచయాలు, సంబంధాలు ఎందుకు అవసరం?




*గ్రాఫ్ 1 : 1961–2011ల మధ్య భారతదేశంలో పట్టణ జనాభా పెరుగుదల*

ప్రతి దశాబ్ద కాలానికి పట్టణ జనాభాలో ఎంతమంది వచ్చి చేరారో, ప్రతి సమూహం యొక్క జనాభాశాతాన్ని లెక్క కట్టండి. ప్రతి బుల్లెట్ పాయింట్‌కి కొన్ని వాక్యాలను రాయండి. కింది ఉదాహరణను పరిశీలించండి.

- 2001–2011 మధ్యకాలంలో పట్టణ జనాభా 9.1 కోట్లు (40+29+22) పెరిగింది. శాతాలలో చూస్తే పెరుగుదలలో 44% సహజ పెరుగుదల వల్ల, 32% పట్టణ ప్రాంతాల విస్తరణ వల్ల, 24% వలస వల్ల జరిగింది.

- 1961-2011 మధ్యకాలంలో వలసల ప్రభావాన్ని చూపటానికి ఒక పట్టిక తయారు చేయండి.
- గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు వలస వెళ్లినప్పుడు గ్రామీణ రంగంలోని ఏ ఆర్థిక రంగం ఎక్కువమందిని కోల్పోతుంది? ఎందుకని?
- గ్రామీణ ప్రాంతాల నుంచి వలస వచ్చిన వాళ్లు పట్టణ ప్రాంతంలో ఉపాధి పొందే ఆర్థిక రంగాలు ఏవి? దీనికి కొన్ని కారణాలను పేర్కొనండి.

## కాలానుగుణ, తాత్కాలిక వలస

జాతీయ జనాభా గణన ప్రకారం భారతదేశంలో ప్రతి నాల్గవ వ్యక్తి వలస వచ్చిన వాళ్లే. 2001-2011లో వలస పెరిగింది కానీ 1980ల కాలంలో పెరిగినంతగా కాదు. వలసలు రాష్ట్రంలోపల ఉండవచ్చు, మరొక రాష్ట్రానికి అయి ఉండవచ్చు. గ్రామీణ ప్రాంతంనుంచి పట్టణ ప్రాంతానికి వలస వెళ్లిన రామయ్య కథనాన్ని మీరు చదివారు. పట్టణానికి రోజుకూలీగా వచ్చిన వ్యక్తిని కూడా మీరు ఇంటర్వ్యూ చేశారు. గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణ ప్రాంతానికి వలస గణాంకాలను, వలసకు గల కారణాలను చూశాం. అయితే గ్రామీణ ప్రాంతాలనుంచి గ్రామీణ ప్రాంతాలకు వలస కూడా పెరిగింది. ఇలా వెళ్లే వలసలు సాధారణంగా ఆరు నెలలలోపు ఉంటాయి. కాబట్టి దీనిని జనాభా గణన గణాంకాలు ప్రతిబింబించకపోవచ్చు. జాతీయ సర్వేలలో 'వలస వెళ్లిన వ్యక్తి' అన్న పదానికి ఉన్న నిర్వచన పరిమితి వల్ల తాత్కాలికంగా వలస వెళ్లే వాళ్ల సంఖ్య తక్కువగా చూపించబడుతోంది.

## మహారాష్ట్రలో చెరుకు నరికేవాళ్లు

దేశంలో పంచదారను ఉత్పత్తి చేసే ప్రముఖ రాష్ట్రాలలో మహారాష్ట్ర కూడా ఒకటి. ఇక్కడ మొత్తం 186 సహకార చక్కెర కర్మాగారాలు ఉన్నాయి. కొయినా ఆనకట్ట కట్టిన తరువాత 1970 దశాబ్ద ఆరంభం నుంచి ఇక్కడ పెద్ద ఎత్తున చెరుకు సాగు చెయ్యటం మొదలుపెట్టారు. ఒక అంచనా ప్రకారం ప్రతి సంవత్సరం చెరుకు నరకటానికి మధ్య మహారాష్ట్ర నుంచి పశ్చిమ మహారాష్ట్రకు 6,50,000 కూలీలు వలస వెళతారు. దీంట్లో ప్రాథమికోన్నత పాఠశాల వయస్సు అయిన 6-14 సంవత్సరాల పిల్లలు 2,00,000 దాకా ఉంటారు. తమ కుటుంబాలతో పాటు వీళ్లు కూడా వలస వస్తారు.

చెరుకు నరికివేతకు రోజులకు వలస వచ్చినవాళ్లు ఫ్యాక్టరీలు కేటాయించిన ఖాళీ ప్రదేశాలలో నివసిస్తారు. ఇవి చేలకు దగ్గరగా ఉంటాయి. ప్రతి కుటుంబానికి కొన్ని బొంగులు, వెదురు తడిక ఇస్తారు. వీటితో వాళ్లు చిన్న గుడిసెవేసుకుంటారు (దీనిని అక్కడ 'కోపి' అంటారు). టైర్ కేంద్ర నివాస ప్రాంతాలలో 200-500 కోపీలు ఉంటాయి, గాడి కేంద్ర నివాస ప్రాంతాలలో 50-100 కోపీలు ఉంటాయి. ఈ కోపీలు ఒకదానికొకటి చాలా దగ్గరగా ఉంటాయి, వాటి ముందు పశువులు కట్టేసి ఉంటాయి. పశువులు, మనుషులు ఇరుకిరుకు పరిస్థితులలో నివసిస్తుంటారు.

తెల్లవారక ముందే చేనుకి చేరుకుని రోజంతా చెరుకు నరుకుతారు, రోజుకి సగటున ఒక వ్యక్తి 1.5 టన్నులు నరుకుతాడు. టన్నుకి చెల్లించే మొత్తం 80 నుంచి 100 రూపాయల మధ్య ఉంటుంది. చేనుని భాగాలుగా చేసి ఒక్కొక్క భాగాన్నీ ఒక పని బృందానికి కేటాయిస్తారు. ఆడమనిషి, మగమనిషి చెరుకు నరికి, ఆకులు తొలగించి కింద పడేస్తారు, పిల్లలు వీటిని ఒక చోటకి కుప్పగా చేరుస్తారు. కుప్పగా ఉన్న చెరుకు గడలను కట్టలుగా కట్టి నెత్తిమీద మోసుకుంటూ బళ్ల దగ్గరకు ఆడ, మగ మనుషులు చేరుస్తారు.

- పశ్చిమ మహారాష్ట్రలో చెరుకు కొట్టేవాళ్ల కొరత ఎందుకుంది?
- తల్లిదండ్రులతో పాటు వలస వచ్చిన వాళ్ల పరిస్థితి ఏమిటి? వీళ్లను బడిలో చేర్పించవచ్చా? ఇటువంటి పిల్లలకు చదువు చెప్పటానికి ప్రభుత్వ చట్టాలలో ఏమైనా అంశాలు ఉన్నాయా?
- చెరుకు నరికే వాళ్లకు ఆ పనిలో ఆరునెలలు మాత్రమే ఎందుకు ఉపాధి లభిస్తుంది? మిగిలిన ఆరు నెలల్లో వాళ్లు ఏ పనులు చేస్తూ ఉంటారు?
- ఇటువంటి కూలీల జీవన పరిస్థితులను ఏ విధంగా మెరుగుపరచవచ్చు?
- పశ్చిమ మహారాష్ట్రలోని ఏడు జిల్లాలయిన నాసిక్, అహ్మద్‌నగర్, పూనా, సతారా, సాంగ్లి, కొల్హాపూర్, షోలాపూర్‌లు "పంచదార పట్టీ"గా పిలవబడతాయి. ఈ పట్టీ ఉత్తరాన సూరత్ (గుజరాత్)లోకి, దక్షిణాన బెల్గాం (కర్నాటక)లోకి విస్తరిస్తుంది. వర్షాధార మెట్ట భూములున్న మరట్వాడాలోని అయిదు జిల్లాలయిన బీడ్, జల్‌గావ్, అహ్మద్‌నగర్, నాసిక్, జల్నాలు చెరుకు నరకటానికి సంవత్సరంలో ఆరు నెలలపాటు వలస కార్మికులను పంపిస్తాయి.
- ఒక పటంలో వలస మొదలయిన జిల్లాలు, వలస చేరుకునే జిల్లాలను చూపిస్తూ బాణం గుర్తులు గీయండి.

మగవాళ్లు బళ్లను ఫ్యాక్టరీలకు తోలుకెళతారు. చెరుకు దిగుమతి కావటానికి అక్కడ వాళ్లు వరసలో కొన్ని గంటలపాటు వేచి ఉండాల్సిరావచ్చు. ఈలోగా ఆడవాళ్లు తమ నివాస ప్రాంతాలకు కొన్ని కిలోమీటర్లు నడుచుకుంటూ వెళతారు. వాళ్లు అలసిఉన్నా ఇంటి పనులు చేయాల్సి ఉంటుంది.


గ్రామీణ ప్రాంత కార్మికులలో అధిక శాతం తక్కువ కాలానికి ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతంలోని సంక్షోభ పరిస్థితుల వల్ల వలస వెళతారు. వీళ్లు ప్రధానంగా వ్యవసాయ కూలీలు, సన్నకారు రైతులు, తక్కువ ఆదాయం గల వాళ్లు, దళితులు, ఆదివాసీలు.

మహారాష్ట్రలో చెరుకు కొట్టేవాళ్లు ఒక గ్రామీణ ప్రాంతం నుంచి మరొక గ్రామీణ ప్రాంతానికి వలస వెళ్లటాన్ని చూశాం. గ్రామీణ స్వల్పకాల వలస కార్మికులు వ్యవసాయం, తోటలు, ఇటుక బట్టీలు, గనుల తవ్వకం, భవన నిర్మాణం, చేపల ప్రాసెసింగ్ వంటి పనులు చేస్తారు. కొన్ని ఉదాహరణలను చూద్దాం.

1990ల చివరి దశకంలో పశ్చిమ బెంగాల్‌లో వరి పండించే ప్రాంత అధ్యయనంలో 5 లక్షల కంటే ఎక్కువ మంది వలస కూలీలు వరికోతల కాలంలో బర్ధమాన్ జిల్లాకి వెళతారని తెలిసింది. ఈ వలస కూలీలలో అధిక సంఖ్య గిరిజనులు, ఇతర తక్కువ కులాల వాళ్లు. ప్రతి సంవత్సరం ఈ వలస కూలీల సంఖ్య పెరుగుతోంది. సవర గిరిజన జాతికి చెందిన మగవాళ్లకు అస్సాంలోని తోటలపనికి వలస వెళ్లే సుదీర్ఘ చరిత్ర ఉంది. ముండ, సంతాల్ జాతి పురుషులు ఒడిశాలోని గనులలో పని చెయ్యటానికి వలస వెళతారు. మహారాష్ట్రలోని చేపల ప్రాసెసింగ్ కర్మాగారాలలో పని చెయ్యటానికి ఏటా కేరళనుంచి 50,000 మహిళలు వలస వెళతారు.

పట్టణ ప్రాంతాలలో భవన నిర్మాణానికి ప్రధానంగా వలస కార్మికులపై ఆధారపడతారు. వలస కార్మికులు సాధారణంగా రోజు కూలీలుగా పని చేస్తుంటారు, ప్లాస్టిక్ సామాను, కూరగాయలు అమ్ముతుంటారు, ఇతర చిన్న చిన్న వ్యాపారాలు చేస్తుంటారు. ఇలా వలస వెళ్లేవాళ్లల్లో అధిక భాగం గిరిజన ప్రజలు, రాష్ట్రంలోని కరువు పీడిత ప్రాంతానికి చెందిన వాళ్లు అయి ఉంటారు. కాలానుగుణంగా వలస వెళ్లేవాళ్లు ఎక్కువగా పేదవాళ్లే, వాళ్లకి సొంత ఊరిలో భూమి కూడా ఉండదు, ఉన్నా కొద్దిగానే ఉంటుంది. చిత్రం 8.2 తక్కువ కాలానికి వలస వెళ్లేవాళ్ల వివరాలను ఇస్తుంది – సర్వే చేసిన దానికి ముందు సంవత్సరంలో సొంత ఊరినుంచి ఆరు నెలలలోపు వలస వెళ్లిన వాళ్లు ఈ కోవలోకి వస్తారు.

చిత్రం 8.2 : 2007-08లో భారతదేశంలో కాలానుగుణ వలసదారుల నేపథ్యం




గ్రామీణ కార్మికులపై జాతీయ కమిషన్ 1990లలో ఇచ్చిన నివేదికలో అసమాన అభివృద్ధి, ప్రాంతాల మధ్య అసమానతలు కాలానుగుణ వలసలకు కారణమని పేర్కొంది. కొన్ని గిరిజన ప్రాంతాలలో బయటివాళ్లు రావటం వల్ల, ఆనకట్టలు కట్టటానికి, గనుల తవ్వకానికి ప్రజలు నిర్వాసితులు కావటం వల్ల తాత్కాలికంగా తప్పనిసరిగా వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వ్యవసాయ రంగంలో వలస వెళ్లేవాళ్ల గ్రామాలకు రైతులు వెళ్లి ఒప్పందాలు కుదుర్చుకుంటారు. అదే కులానికి, వర్గానికి లేదా ప్రాంతానికి చెందిన గుత్తేదారులను (వీళ్లనే ఏజెంట్లని కూడా అంటారు), వ్యాపారస్తులను ఢిల్లీలోని గనుల యజమానులు, కర్నాటకలోని కాఫీ తోటల యజమానులు వలస కార్మికులతో ఒప్పందాలు కుదుర్చుకోటానికి ఉపయోగించుకుంటారు. పంజాబ్‌లో వలస వచ్చిన కూలీలద్వారా ఇతరులను కూడా పనులకు పిలిపించుకుంటారు. దీనికి యజమానుల నుంచి గుత్తేదారులకు కొంత ప్రతిఫలం అందటమే కాకుండా వలస కూలీలకు వచ్చేదాంట్లో నుంచి కూడా కొంత తీసుకుంటారు. కొన్ని సందర్భాలలో గుత్తేదారులు పర్యవేక్షకులుగా కూడా పని చేస్తారు.

- మీ ప్రాంతంలో కాలానుగుణ వలస వెళ్లే వాళ్ల పరిస్థితిని వివరించండి.

## ప్రజలు వలస వెళ్లినప్పుడు ఏమవుతుంది?

వలస వెళ్లిన ప్రదేశంలో ఆ కార్మికులకు చౌకధరల దుకాణాల నుంచి సరుకులు దొరకవు కాబట్టి వాళ్లు ఆహారధాన్యాలపై ఎక్కువ ఖర్చు చేయాల్సి ఉంటుంది. చాలా తీవ్రమైన పరిస్థితులలోనూ, పారిశుద్ధ్యంలేని వాతావరణంలోనూ నివసించాల్సి రావటం వల్ల వాళ్లు అనేక అనారోగ్యాలకు, రోగాలకు గురౌతారు. గనులు, ఇటుక బట్టీలు, నిర్మాణ పనులలో పనివల్ల వాళ్లు ఒళ్లునొప్పులు, వడదెబ్బ, చర్మవ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులకు లోనవుతారు. యజమానులు సరైన భద్రతాచర్యలు తీసుకోకపోవటం వల్ల పారిశ్రామిక ప్రదేశాలు, భవన నిర్మాణ ప్రదేశాలలో ప్రమాదాలు తరచు సంభవిస్తూ ఉంటాయి. వలస కార్మికులు సంఘటిత రంగంలో లేనందువల్ల వాళ్లకి వివిధ ఆరోగ్య, కుటుంబ సంరక్షణ కార్యక్రమాలు అందటం లేదు. వలస వచ్చిన మహిళా కూలీలకు ప్రసూతి సెలవలు ఉండవు. అంటే ప్రసవించిన కొద్ది రోజులకే వాళ్లు తిరిగి పనికి వెళ్లవలసి ఉంటుంది.

కుటుంబాలు వలస వెళ్లినప్పుడు తల్లిదండ్రులతో పాటు వెళ్లే చిన్నపిల్లలకు శిశు సంరక్షణ కేంద్రాలు ఉండవు. పెద్దపిల్లలు కొత్త ప్రదేశంలో చదువు కొనసాగించే వీలు ఉండదు. వాళ్లు స్వగ్రామాలకు తిరిగి వెళ్లినప్పుడు అక్కడి పాఠశాలలు కూడా వాళ్లని మళ్లీ చేర్చుకోవు. చివరికి వాళ్లు బడికి వెళ్లటం మానేస్తారు. కుటుంబంలో కేవలం మగవాళ్లే వలసకి వెళ్లినప్పుడు కుటుంబ బాధ్యతలు, వృద్ధుల సంరక్షణ భారం

అంతా ఆడవాళ్ల మీద పడుతుంది. ఇటువంటి కుటుంబాలలోని ఆడపిల్లలమీద తమ్ముళ్లు, చెల్లెళ్లను చూసుకోవాల్సిన భారం ఉండి చివరికి చాలామంది బడి మానేస్తారు.

వలస వెళ్లిన వాళ్లమీద కూడా వలస ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుంది. భిన్నమైన వాతావరణంలో ఉండాల్సి రావడం, దానివల్ల కలిగే ఒత్తిడి, ఆహార మార్పు, సామాజిక వాతావరణం వల్ల వలస వెళ్లిన వాళ్లు తీవ్రంగా ప్రభావితులవుతారు. వలస కాలం బట్టి ఈ ఒత్తిడి తీవ్రత ఉంటుంది. ఒక్కొక్కసారి కొత్త ఆలోచనలకు ప్రభావితులయ్యి పాత భావాలను ప్రశ్నిస్తారు.

వలస వెళ్లే వాళ్లలో చాలామంది, ప్రత్యేకించి దీర్ఘకాలం వలస వెళ్లేవాళ్లు ఊరిలో ఉన్న తమ కుటుంబాలకు డబ్బులు పంపిస్తారు. భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో మూడింట ఒక వంతు కుటుంబాలు వలస సభ్యులు పంపించే డబ్బుపై ఆధారపడి ఉన్నాయి. కాలానుగుణంగా వలస వెళ్లే వాళ్లల్లో చాలామంది ఇంటికి డబ్బు పంపిస్తారు, లేదా మిగుల్చుకున్న డబ్బు తమతో తీసుకెళతారు. వలస వెళ్లటం వల్ల ఆస్తులు అమ్ముకోకుండా అప్పులు తీర్చటానికి, ఇతర కార్యక్రమాలకు డబ్బు సమకూరుతుంది. వలస వెళ్లిన కుటుంబాలు ఇల్లు, భూమి, వ్యవసాయ పరికరాలు,

- వలస వెళ్లిన వాళ్లకు ఆహారం, వైద్య, కుటుంబ సంరక్షణ కార్యక్రమాలు అందటానికి ఏం చెయ్యాలి?
- ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు కొన్ని చర్యలు చేపట్టాయి. మీ ప్రాంతంలో ఇటువంటివి ఏమైనా ఉన్నాయేమో తెలుసుకోండి. అటువంటి సంస్థల నుంచి వ్యక్తులను మీ పాఠశాలకు పిలిచి మాట్లాడమనండి.










*చిత్రం 8.3 : వలస వ్యక్తులు రాకుండా జాతీయ సరిహద్దులను కాపాడుతుంటారు. ఇక్కడ కొన్ని ఉదాహరణలు చూద్దాం:*
*1) మెక్సికో సరిహద్దు వెంట అమెరికాలో,*
*2) ఉత్తర కొరియా సరిహద్దు వెంట దక్షిణ కొరియాలో*
*3) బంగ్లాదేశ్ సరిహద్దు వెంట భారతదేశంలో. ఇలా దేశ సరిహద్దులను దాటేవాళ్ల గురించి మీ అభిప్రాయం ఏమిటి?*

వినియోగ వస్తువులు కొనటం సాధారణంగా చూస్తూ ఉంటాం. వలస వెళ్లిన వాళ్లల్లో కొంతమంది వలస వెళ్లిన ప్రదేశంలో ఉద్యోగం పొందవచ్చు, అవసరమైన నైపుణ్యాలు అక్కడ పెంపొందించుకోవచ్చు, మంచి ఉద్యోగాల గురించి తెలుసుకుని క్రమం తప్పకుండా లేదా శాశ్వతంగా వలస వెళ్లవచ్చు.

## అంతర్జాతీయ వలసలు

ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం ప్రకారం 20 కోట్ల అంతర్జాతీయ వలస వ్యక్తులలో 7 కోట్లకంటే తక్కువ మంది ఒక అభివృద్ధి చెందుతున్న దేశంనుంచి మరొక అభివృద్ధి చెందుతున్న దేశానికి వలస వెళుతున్నారు. భారతదేశం నుంచి అంతర్జాతీయ వలసలు రెండు రకాలు:

సాంకేతిక నైపుణ్యం, వృత్తి అనుభవం ఉన్న వ్యక్తులు అమెరికా, కెనడా, ఇంగ్లాండు, ఆస్ట్రేలియా వంటి అభివృద్ధి చెందిన దేశాలకు వలస వెళుతున్నారు. ఐటి నిపుణులు, డాక్టర్లు, మేనేజ్‌మెంట్ నిపుణులు ఈ రకానికి ఉదాహరణ. 1950లు, 1960లలో కెనడా, ఇంగ్లాండునకు వలస వెళ్లిన భారతీయులలో ఎక్కువమంది ఏ నైపుణ్యమూ లేనివాళ్లు కాగా గత పది సంవత్సరాలలో ఎక్కువగా వృత్తి నిపుణులు ఈ దేశాలకు వెళుతున్నారు. ఇటీవల కాలంలో భారతదేశ వృత్తినిపుణులు జర్మనీ, నార్వే, జపాన్, మలేషియా వంటి దేశాలకు కూడా వలస వెళుతున్నారు. 1950లలో అభివృద్ధి చెందిన దేశాలకు సంవత్సరానికి 10,000 మంది వలస వెళ్లగా, 1990లలో ఈ సంఖ్య 60,000కి పెరిగింది.

రెండవ రకం వలసలు చమురు ఎగుమతి చేస్తున్న పశ్చిమ ఆసియా దేశాలకు తాత్కాలిక ఒప్పందాలపై వలస వెళుతున్న నైపుణ్యంలేని, కొంత నైపుణ్యం ఉన్న పనివాళ్లు. వలస వెళ్లిన దేశాలలోని పరిస్థితిని బట్టి కొంతకాలం తరువాత ఇలా వలస వెళ్లిన వాళ్లంతా తిరిగి వస్తారు. భారతదేశం నుంచి పశ్చిమ ఆసియాకి వెళుతున్న 30 లక్షల వలస వ్యక్తులలో ఎక్కువమంది సౌదీ అరేబియాకి, యు.ఏ.ఇ.(United Arab Emirates)కి వెళుతున్నారు. ప్రతి సంవత్సరం పశ్చిమ ఆసియాకి 3 లక్షల కార్మికులు వలస వెళుతున్నారు. పశ్చిమ ఆసియాకి వలస వెళుతున్న కార్మికులలో అయిదింట ముగ్గురు కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వారు. ఈ వలస కార్మికులలో అధిక శాతం భవన నిర్మాణం, మరమ్మతుల నిర్వహణ, సేవలు, రవాణా, టెలికమ్యూనికేషన్ రంగాలలో పనిచేస్తున్నారు.

వలస వెళ్లిన వాళ్ల ప్రాంతంపై అంతర్జాతీయ వలస ప్రభావం చాలా ముఖ్యమైనది. వలస వెళ్లిన వాళ్ల కుటుంబాలు అప్పులు తీర్చగలగటం, ఆస్తులు కొనటం, జీవనశైలిలో మార్పు వంటి వాటిలో ఈ ప్రభావం బాగా కనపడుతుంది. కేరళ మొత్తం ఆదాయంలో అయిదింట ఒక వంతు పశ్చిమ ఆసియాలో పనిచేస్తున్న వాళ్లు పంపించే డబ్బు ద్వారా సమకూరుతోందని ఒక అధ్యయనంలో వెల్లడయ్యింది. 1970లలో కేరళలో తలసరి సగటు వినియోగం దేశ సగటు కంటే తక్కువగా ఉండేది. కానీ 30 ఏళ్ల తరువాత ఇది దేశం సగటుకంటే 40 శాతం ఎక్కువగా ఉంది (బాక్సు చూడండి).

- పై పేరాలలో పేర్కొన్న భారతదేశం నుంచి ఇతర దేశాలకు వెళుతున్న వలసలను చూపిస్తూ ప్రపంచ పటంలో బాణం గుర్తులు గీయండి.

**రూపాయి బలహీన పడడంతో కేరళకి వస్తున్న డబ్బు 75,000 కోట్ల రూపాయల శిఖరానికి చేరిన వైనం**

బలహీన పడిన రూపాయి కారణంగా దేశమంతా సతమతమవుతుండగా ప్రవాస కేరళీయులు సంతోషంగా ఉన్నారు. ఒక సంవత్సరంలో సాధించాల్సిన 75,000 కోట్ల రూపాయల జమను 2013లో ఆరు నెలల కాలంలోనే సాధించారు.

దేశంలోకి వచ్చే డబ్బులో ప్రతి సంవత్సరం ఉండే వృద్ధిలో జూన్ చివరినాటికి ఏకంగా 36 శాతం పెరిగి 75,883 కోట్ల రూపాయలకు చేరుకుంది.

రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ ప్రకారం (రాష్ట్రంలోని మొత్తం డిపాజిట్లలో 32.8 శాతం వీళ్ల దగ్గర ఉన్నాయి) జూన్ 2012 నాటి 55,663 కోట్ల రూపాయలతో పోలిస్తే ఇది 20,220 కోట్ల రూపాయలు అదనం.

25 లక్షల దాకా ఉన్న ప్రవాస కేరళీయులు రాష్ట్ర జిడిపిలో 35 శాతానికి దోహదం చేస్తున్నారు. కేరళలో ప్రధాన పండగైన ఓనం పండుగ కారణంగా ప్రస్తుతం లగ్జరీ కార్లు, ఇతర ఖరీదైన వస్తువుల అమ్మకాలు వేగంగా జరుగుతున్నాయి. ప్రవాసులు అధికంగా ఉన్న పంజాబులో తప్పించి దేశంలోని మిగిలిన ప్రాంతాలలో అమ్మకాలు చప్పగా ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో ప్రవాసులు పంపిన 60,000 కోట్ల రూపాయలు కేరళ జిడిపిలోని మూడవ వంతుగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇదే తీరులో డబ్బులు వస్తుంటే అది రాష్ట్ర జిడిపిలో 40 శాతాన్ని మించవచ్చు.

అభివృద్ధి అధ్యయన కేంద్రంలోని వలస విభాగం ఇచ్చిన నివేదిక ప్రకారం రాష్ట్రానికి ప్రవాసుల ద్వారా వచ్చే డబ్బు రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ ఆదాయం కంటే 1.6 రెట్లు ఎక్కువ. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే దానికంటే 6.2 రెట్లు ఎక్కువ. అంతేకాదు ఒక సంవత్సరంలో ప్రభుత్వ ఖర్చుకు 2 రెట్లు కంటే ఎక్కువ.

**మూలం :** ది హిందూస్తాన్ టైమ్స్, సెప్టెంబరు 15, 2013, ముంబయి.

భారత దేశీయులు విదేశాలకు వలస వెళ్లి పనిచేయటాన్ని వలసల చట్టం, 1983 అన్న భారతదేశ చట్టం పర్యవేక్షిస్తుంది. పని నిమిత్తం వెళ్లే వాళ్ల ప్రయోజనాలను కాపాడటానికి ఇది కొన్ని షరతులు విధిస్తుంది. వివిధ దేశాలలో భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన దౌత్య కార్యాలయాలు వలసల చట్టంలో పొందు పరిచిన విధంగా చట్టపర విధానాలను పాటించి అంతర్జాతీయ వలస కార్మికుల సంక్షేమాన్ని కాపాడాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాలలో వలస కార్మికులకు జీతాలు చెల్లించరు. కొన్నిసార్లు వలస వెళ్లాలనుకుంటున్న కార్మికులను ఏజెంట్లు మోసం చేస్తారు, లేదా విదేశాలలో పని చూపించటానికి సిఫారసు చేసినదానికంటే ఎక్కువ రుసుము వసూలు చేస్తారు. ఒక్కొక్కసారి యజమానుల ఒప్పంద కాలం ముగియకుండా ఒప్పందాన్ని రద్దు చేస్తారు, లేదా వలస కార్మికులు నష్టపోయేలా ఒప్పంద పత్రాన్ని మారుస్తారు, ఇస్తామన్న దానికంటే తక్కువ జీతం ఇస్తారు, ఇతర ప్రయోజనాలు, ప్రోత్సాహకాలను నిలిపివేస్తారు. వాళ్లు తరచు కార్మికులతో బలవంతంగా అదనపు గంటలు పని చేయించుకుని, అందుకు అదనపు వేతనం చెల్లించరు. కార్మికులను వాళ్ల పాస్‌పోర్టు వాళ్ల దగ్గర ఉంచుకోనివ్వరు. ఉద్యోగం పోతుందన్న భయంతో భారత వలస కార్మికులు అరుదుగా తప్పించి తమ విదేశీ యజమానులపై ఫిర్యాదులు నమోదు చెయ్యరు.

## కీలక పదాలు

వలస　విదేశాలకు వలస　అంతరరాష్ట్ర వలస　కాలానుగుణ వలస　దేశ సరిహద్దు

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1. కింది వాటితో ఒక పట్టిక తయారుచేసి వలస కార్మికుల వివిధ ఉదాహరణలను క్రోడీకరించండి : (1) వలస కార్మికులు; (2) వలసల కారణాలు; (3) వలస వెళ్లిన వాళ్ల జీవన ప్రమాణాలు; (4) వాళ్ల జీవితాల ఆర్థిక స్థితిపై ప్రభావం; (5) వాళ్లు వలస వచ్చిన ప్రాంత ప్రజల జీవితాల ఆర్థిక స్థితిపై ప్రభావం.
2. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు, గ్రామీణ ప్రాంతాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు వలసల మధ్య పోలికలు, తేడాలు రాయండి.
3. వీటిల్లో దేనిని కాలానుగుణ వలసగా పరిగణించవచ్చు? ఎందుకు?
   అ. వివాహం కారణంగా తల్లిదండ్రుల ఇంటినుంచి భర్త ఇంటికి స్త్రీ వెళ్లటం.
   ఆ. తమిళనాడులో పసుపుదుంప తీయటానికి ఒక జిల్లానుంచి మరొక జిల్లాకి మూడు నెలలపాటు వెళ్లటం.
   ఇ. సంవత్సరంలో ఆరునెలల కోసం ఢిల్లీలో రిక్షా తోలటానికి బీహారు గ్రామీణ ప్రాంతాల నుంచి వెళ్లటం.
   ఈ. హైదరాబాదులో ఇళ్లల్లో పనిచెయ్యటానికి నల్గొండ జిల్లా నుంచి ఆడవాళ్లు రావటం.
4. వలస వెళ్లిన వాళ్లు ఆ ప్రాంతంలో సమస్యలు సృష్టిస్తారా/ సమస్యలకు కారణం అవుతారా? మీ సమాధానానికి కారణాలు ఇవ్వండి.
5. కింద వివిధ రకాల వలస ఉదాహరణలు ఉన్నాయి. వాటిని అంతర్గత, అంతర్జాతీయ వలసలుగా వర్గీకరించండి.
   అ. సాంకేతిక పనివాళ్లుగా పనిచెయ్యటానికి భారతదేశం నుంచి సౌదీ అరేబియాకి వెళ్లటం.
   ఆ. బీహారు నుంచి పంజాబుకి వెళ్లే వ్యవసాయ కూలీలు.
   ఇ. ఒడిశా నుంచి ఆంధ్రప్రదేశ్‌కి ఇటుక బట్టీలలో పనిచెయ్యటానికి వెళ్లటం.
   ఈ. భారతీయ పిల్లలకు చైనీస్ భాష నేర్పటానికి చైనా నుంచి వచ్చే టీచర్లు.
6. 'వలస కుటుంబాలలోని అధిక శాతం పిల్లలు బడి మధ్యలోనే మానేస్తారు.' దీనితో మీరు ఏకీభవిస్తారా? మీ సమాధానానికి కారణాలు పేర్కొనండి.
7. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లటం వల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజల కొనుగోలు శక్తి ఎలా పెరుగుతుంది?
8. వృత్తి నైపుణ్యం ఉన్నవాళ్లే అభివృద్ధి చెందిన దేశాలకు ఎందుకు వలస వెళ్లగలుగుతున్నారు? నైపుణ్యంలేని కార్మికులు ఈ దేశాలకు ఎందుకు వెళ్లలేరు?
9. పశ్చిమ ఆసియా దేశాలలో భారతదేశం నుంచి నైపుణ్యంలేని కార్మికులనే ఎందుకు కోరుకుంటున్నారు?
10. మూడు రాష్ట్రాల ప్రజలు చాలా దూరంలోని పశ్చిమ ఆసియాకు ఎలా వెళ్లగలుగుతున్నారు?
11. అంతర్గత, అంతర్జాతీయ వలసల ప్రభావాల మధ్య పోలికలను, తేడాలను పేర్కొనండి.